గుడిలో ఓట్ల దండకం

భక్తులను ఆకట్టుకునేందుకు అభ్యర్థుల ఆరాటం

కార్తీకమాసం భోజనాలు స్పాన్సర్



బంజారాహిల్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ తేదీ సమీపిస్తున్నా కొంతమంది అభ్యర్థుల్లో టెన్షన్ పెరుగుతోంది. ఓటు బ్యాంక్‌లు కొల్లగొట్టేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాదేదీ ప్రచారానికి అనర్హం అన్నట్టు ప్రవర్తిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆలయాలు, ప్రార్థన మందిరాలను కూడా వదలడం లేదు. ఆలయాలు, మసీదులు, చర్చిలను సందర్శిస్తూ ఓటర్లను కలుసుకోవడంతో పనిలో పనిగా దేవుడిని గెలుపు కోసం ప్రార్థిస్తున్నారు. కార్తీకమాసం కావడంతో ఆలయాలకు భక్తుల తాకిడి తీవ్రంగా ఉంటుంది. దీనిని అభ్యర్థులు అవకాశంగా మార్చుకున్నారు. రద్దీ అధికంగా ఉండే శివాలయాలను సందర్శిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యను బట్టి ప్రసాదాలు వితరణ చేస్తూ తమకే ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. తొలి కార్తీక సోమవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కువ సమయాన్ని ఆలయాలకు కేటాయించారు. ప్రత్యేక పూజలు చేయడంతో ప్రచారం నిర్వహించారు. ఓ పార్టీకి చెందిన అభ్యర్థి కార్తీక పౌర్ణమి రోజున అఖండ దీపారాధన పేరిట ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం పెట్టించి వన భోజనాల పేరిట వచ్చిన వారందరికీ భోజనాలు కూడా పెట్టించే ఏర్పాట్లు చేస్తున్నారు. మరో అభ్యర్థి కార్తీక పౌర్ణమి రోజున ప్రసిద్ధిగాంచిన ఓ ఆలయంలో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు. మధ్యమధ్యలో తానే భజన పెట్టించినట్టుగా ప్రకటించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికల కమిషన్‌కు దొరకకుండా పార్టీ పేరు చెప్పకుండా అభ్యర్థి పేరు మాత్రమే మైకులో వినిపించేలా చెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అయ్యప్పలకు స్పెషల్ సేవ

కార్తీక మాసం కావడంతో అయ్యప్ప దీక్షలు ఊపందుకున్నాయి. వేల సంఖ్యలో దీక్షలు తీసుకుంటుండడంతో కొంతమంది అభ్యర్థులు ఆయా ఆలయాలకు వెళ్లి దీక్షాపరులను కలిసి మద్దతు కోరుతున్నారు. ఇటీవల ఓ అభ్యర్థి అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించడంతో పాటు అన్నదానం కూడా చేశారు. నవంబరు 11న పోలింగ్ రోజు నియోజకవర్గం నుంచి శబరిమలకు వెళ్తున్న వారి వివరాలు సేకరించి వారితో ప్రయాణం వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలింగ్ తేదీన 22 మంది భక్తులతో కూడిన బృందం శబరిమలకు రైలు టికెట్లు బుక్ చేసుకోగా నాయకులు వాటిని క్యాన్సిల్ చేసి బస్సు ఇచ్చి పంపిస్తామంటూ మాట ఇచ్చారు.

మత పెద్దల దీవెనలు

ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మసీదు, చర్చీల్లో కూడా రాజకీయ నేతల హడావుడి జోరందుకుంది. పాస్టర్లను కలుసుకొని ఆశీర్వాదం తీసుకుంటున్నారు. వారితో సమావేశం నిర్వహించి చర్చీల అభివృద్ధిపై చర్చిస్తున్నారు. మరోవైపు మసీదుల్లో జరిగే ప్రార్థనల్లో కూడా పాల్గొంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. రహ్మత్‌నగర్ గురుద్వారాలో జరిగిన వేడుకల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు హడావుడి చేశారు. ప్రార్థనలు నిర్వహించిన అనంతరం మద్దతు కోరారు. నియోజకవర్గంలో సుమారు ఆరు వేల ఓట్లు ఉండడంతో ఉత్సవాలు జరిగిన మూడు రోజుల పాటు అభ్యర్థులు గురుద్వారాను సందర్శించారు.


దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, అభ్యర్థి నవీన్ యాదవ్


ప్రచారం చేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు

బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పండి

మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు

ఎర్రగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కుట్రపూరిత రాజకీయాలతో ముందు తిట్టుకుంటూనే వెనక కలిసి పనిచేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలకు ఈ ఉప ఎన్నికలో బుద్ధి చెప్పాలని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. లక్ష్మీకాంప్లెక్స్, ఛత్రపతి శివాజీ నగర్, ఆనంద్ నగర్, బంజారానగర్, ప్రేమ్‌నగర్, సుల్తాన్ నగర్, నూర్ మసీదు, న్యూ సుల్తాన్‌నగర్, జమా మసీదు, నేతాజీ నగర్, రాజీవ్ నగర్ కాలనీల్లో గడపగడపకూ తిరిగి ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం, నూతన రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. నవీన్ యాదవ్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ రాజేష్‌రెడ్డి, శ్రీగణేశ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఏఐసీసీ జాతీయ కో-ఆర్డినేటర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి, డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, కార్పొరేటర్ విజయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు బస్తీల్లో ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగం కో-ఆర్డినేటర్ రమేష్ నాయక్, నగర ప్రధాన కార్యదర్శి దూడల రవి గౌడ్, నాయకులు బాబునాయక్, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం


ప్రచారం చేస్తున్న డాక్టర్ మల్లు రవి, డా.చిక్కుడు వంశీకృష్ణ, విజయారెడ్డి, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

బోరబండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో పీజేఆర్ తనయ విజయారెడ్డి, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి గురువారం వారు ప్రచారం చేశారు. ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పాటుపడాలని కోరారు.

తెలంగాణ ఉద్యమకారుల మద్దతు


అభివాదం చేస్తున్న వెన్నెలగద్దర్, తదితరులు

పంజాగుట్ట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, ప్రజలను మోసం చేసిందని, అందుకే ఆ నిరంకుశ పాలనను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించారని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రన్నప్రసాద్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎటువైపు తెలంగాణ ఉద్యమకారులు? అనే అంశంపై గురువారం చర్చాగోష్ఠి జరిగింది. తొలి, మలిదశ ఉద్యమకారులు మాట్లాడారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ 'బీఆర్ఎస్, బీజేపీ హఠావో.. కాంగ్రెస్ జితావో' నినాదంతో ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. సమావేశంలో అన్వర్ పటేల్, బి.రంగారెడ్డి, టి.లింగయ్య, ఇట్టే ప్రభాకర్, బి.లావణ్య, కోరే సాయిరాం, కాంపెల్లి సాయిలు, సుజ్జి, అంజలమ్మ, ఉద్యమకారులు పాల్గొన్నారు.

సాయుధ దళాల కవాతు


కవాతు చేస్తున్న సాయుధ దళాల సిబ్బంది

బోరబండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నిక సందర్భంగా బోరబండ ఠాణా పరిధిలో సాయుధ దళాలు గురువారం కవాతు నిర్వహించాయి. బోరబండ సైట్-3 కాలనీ నుంచి హైటెక్ హోటల్, పీజేఆర్ గ్రౌండ్, ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతాల మీదుగా శ్రీరామ్‌నగర్ వరకు కవాతు కొనసాగింది. ఉప ఎన్నిక సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు, బోరబండ ఇన్‌స్పెక్టర్ మల్కాపురం సురేందర్, ఎస్ఐలు షేక్ నాగుల్ మీరా, మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.


బోరబండలో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి అస్మాబేగం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించాలి

బోరబండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను ఓడించాలని స్వతంత్ర అభ్యర్థి అస్మాబేగం కోరారు. తన ఎన్నికల చిహ్నం టార్చిలైట్ గుర్తున్న ప్లకార్డులతో బోరబండ పరిసర ప్రాంతాల్లో గురువారం ఆమె ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్ అంటే పదిమంది ధనికులు మాత్రమే కాదని, వందమంది పేదలుండే ప్రాంతమని తెలిపారు. నిరుద్యోగుల తరఫున తాను పోటీ చేస్తున్నానని, జూబ్లీహిల్స్‌లోని పరిస్థితులు చూస్తుంటే కళ్ల నుంచి రక్తం కారుతోందని చెప్పారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఐఐఎంసీ అధ్యాపకురాలికి డాక్టరేట్


రాజ్యలక్ష్మీకళ్యాణి

ఖైరతాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐఐఎంసీ కళాశాల అధ్యాపకురాలు సీహెచ్ రాజ్యలక్ష్మీకళ్యాణి ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ ఫాకల్టీలో డాక్టర్ అఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) సాధించారు. ఈమేరకు ఆమె అధ్యయనం చేసిన అనురాగ్ విశ్వ విద్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వు రావడంతో లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. త్వరలో పీహెచ్‌డీ ప్రదానం ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు.

శెభాష్ పోలీస్..

- రోడ్డుపై గుంతలు పూడ్చివేత


కల్పతరువు వద్ద రోడ్డుపై గుంతలను పూడుస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఎర్రగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ కల్పతరువు రెసిడెన్సీ వద్ద ఈ మధ్య నూతనంగా సీసీ రోడ్డును నిర్మించారు. చివర కొంతభాగం మెట్రో పిల్లర్ నెంబర్.943 వద్ద పెద్ద, పెద్ద గుంతలు తేలి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గమనించిన ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం ఆ గుంతలను పూడ్చి అందరి చేత శెభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా కల్పతరువు రెసిడెన్సీ మాజీ అధ్యక్షుడు లయన్ డాక్టర్ చేకూరు హనుమంతు నాయుడు మాట్లాడుతూ కొంతకాలంగా ఉన్న గుంతలను ట్రాఫిక్ పోలీసులు పూడ్చి ప్రమాదాలను నివారించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రతీ ఓటు విలువైనదే : వక్తలు

- 2న ఉపఎన్నిక అభ్యర్థులతో ముఖాముఖి



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

పంజాగుట్ట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మతం, కులం, డబ్బు వంటివి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయని, అధికార పార్టీలు తమ విస్తృత అధికారాలను ఉపయోగించి గెలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని వక్తలు ఆరోపించారు. ప్రతీ ఓటు విలువైనదేనని, ఒక్క ఓటు గెలుపోటములను నిర్దేశించిన సందర్భాలు ఉన్నాయని వారు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓటరు అవగాహన కార్యక్రమం జరిగింది. ఫోరం అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్, పూర్వ రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి, విశ్రాంత ఐఏఎస్‌లు చంద్రవదన్, ఎంవీరెడ్డి, విశ్రాంత ఐపీఎస్ అధికారి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఓటును అమ్ముకోవద్దని సూచించారు. చంద్రవదన్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడానికి ఎఫ్‌జీజీ సహకరిస్తుందన్నారు. ఎంవీరెడ్డి మాట్లాడుతూ అందరూ ఓటు వేయాలని కోరారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రతీ అభ్యర్థి ఖర్చుపై నిఘా పెట్టాలన్నారు. పద్మనాభరెడ్డి మాట్లాడుతూ ఫోరం ఆధ్వర్యంలో నవంబరు 2న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొని అభ్యర్థులను ప్రశ్నించ వచ్చని తెలిపారు. సమావేశంలో వివేక్, భాస్కర్‌రెడ్డి, సి.విజయకుమార్‌రెడ్డి, జి.శ్యామ్‌ప్రసాద్, ఫోరం కార్యదర్శి సోమ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కేంద్రం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ఎర్రగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి కృషి చేస్తుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఎర్రగడ్డ మోతీనగర్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్లో గురువారం సాయంత్రం బీజేపీ ఎస్సీ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వంలో 12 మంది దళితులకు మంత్రి పదవులు దక్కాయన్నారు. దేశ అత్యున్నత రాష్ట్రపతి హోదాలో గిరిజన సామాజిక వర్గానికి చెందిన దౌపదిముర్ము కొనసాగుతున్నారని, గతంలో రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా పనిచేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డిని గెలిపించడం ద్వారా రాష్ట్రంలో రాజ్యాధికారం వస్తుందన్నారు. డబుల్ ఇంజన్ సర్కారుతో బడుగు, బలహీనవర్గాలకు మేలు జరుగుతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనలో ఏర్పడిన అధికార పరాజితాలు, మజ్లిస్‌తో అనైతిక సంబంధాల పొత్తుల కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, డివిజన్ ఎస్సీ మోర్చా ఎన్నికల సమన్వయకర్త పి.సునీల్ కుమార్, ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జి మేకల సారంగపాణి, కుంభాల గంగరాజు, దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు దర్శనం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలతో టీ తాగుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రచారంలో పార్టీ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్, ఎమ్మెల్సీ తాతా మధు

బీఆర్ఎస్ కంచుకోట జూబ్లీహిల్స్

వెంగళరావునగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌తో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు కృష్ణకాంత్ పార్కు వద్ద జెండా ఊపి మహిళా బైక్ ర్యాలీని ప్రారంభించారు. కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, స్థానిక కార్పొరేటర్ దేదీప్యవిజయ్, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ సతీమణి అయేషా, పార్టీ నాయకులతో కలిసి వికాస్‌పురి కాలనీ, సిద్ధార్థ నగర్, ఏజీ కాలనీలలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. మాగంటి సునీతను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సూచిక బోర్డు తొలగించి ప్రభుత్వ స్థలం ఆక్రమణ

- పోలీసులను ఆశ్రయించిన బస్తీవాసులు



తొలగించిన ప్రభుత్వ సూచిక బోర్డు

బంజారాహిల్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సుమారు ఐదు కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారులు ఆక్రమించేందుకు ప్రతీ నిత్యం ప్రయత్నిస్తూనే ఉన్నారు. స్థానికులు అడ్డుకుంటూనే ఉన్నారు. తాజాగా గురువారం ఓ మహిళ సూచిక బోర్డును తొలగించి మరీ ఆక్రమించేందుకు ప్రయత్నించింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.13లోని శ్రీరాంనగర్‌లో ప్రభుత్వానికి చెందిన 500 గజాల ఖాళీ స్థలం ఉంది. చాలాకాలంగా కొంతమంది స్థలం తమదేనంటూ ఆక్రమించేందుకు ప్రయత్నించారు. బస్తీవాసులు అడ్డుకోవడంతో పాటు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా, గతేడాది ఇలాగే ఆక్రమణకు యత్నించడంతో అధికారులు ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం ఆ స్థలంలో పాఠశాల నిర్మించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు స్థలం రెవెన్యూ నుంచి విద్యాశాఖకు బదిలీ అయింది. పాఠశాల నిర్మాణానికి రెండున్నర కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించారు. ఇదిలా ఉండగా, సనా అనే మహిళ గురువారం తన మనుషులతో స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి సూచిక బోర్డును తొలగించింది. విషయం తెలుసుకున్న బస్తీవాసులు అడ్డుకోవడంతో పాటు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



గుడిసె వాసులకు వస్తువులను పంపిణీ చేస్తున్న కల్పన

మొండిబండ గుడిసె వాసులకు దుస్తుల పంపిణీ

అడ్డగుట్ట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అడ్డగుట్ట డివిజన్ మొండిబండ గుడిసెవాసులకు గురువారం దుస్తులు తదితరాలు వస్తువులను పంపిణీ చేశారు. స్టేషనరీ, శానిటరీ ప్యాడ్స్, దోమ తెరలు, ఇతర వస్తువులు పంపిణీ చేశామని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పులి కల్పన తెలిపారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



పార్శీగుట్ట చౌరస్తాలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మగౌరవ ర్యాలీకి తరలిరండి

బౌద్ధనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీ నవంబర్ 1న నిర్వహించనున్న నేపథ్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికారప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని గురువారం పార్శీగుట్టలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ప్లకార్డులను చేతబూని ప్రదర్శన నిర్వహించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మీద షూతో దాడికి యత్నించిన దుండగుడిపై సుమోటోగా కేసును నమోదు చేసి పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ నాయకత్వంలో నిర్వహిస్తున్న ఆత్మగౌరవ ర్యాలీకి ప్రతిఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, సి.దేవేందర్, డి.శివప్రసాద్, రుద్ర, వినయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ

బౌద్ధనగర్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ శ్రీనివాసనగర్ .. శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ కుంభాభిషేకాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయ ఏర్పాట్లను కంచికామకోటి శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతి పరిశీలించారు. ఆయన పలు సలహాలు, సూచనలు అందించి నిర్వహణ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొడకండ్ల రాజేష్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న కంచి కామకోటి శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతి



బోరబండ ఠాణా పరిధిలో కవాతు చేస్తున్న సాయుధ దళాలు

సాయుధ దళాల కవాతు

బోరబండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నిక సందర్భంగా బోరబండ ఠాణా పరిధిలో సాయుధ దళాలు గురువారం కవాతు నిర్వహించాయి. బోరబండ సైట్-3 కాలనీ నుంచి హైటెక్ హోటల్, పీజేఆర్ గ్రౌండ్, ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతాల మీదుగా శ్రీరామ్‌నగర్ వరకు కవాతు కొనసాగింది. ఉప ఎన్నిక సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్రరావు తెలిపారు. బోరబండ ఇన్‌స్పెక్టర్ మల్కాపురం సురేందర్, ఎస్ఐలు షేక్ నాగుల్ మీరా, మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

చిక్కడపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతాంగానికి సహాయక చర్యలు చేపట్టాలని టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడారు. తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలవల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. తుపాను ప్రభావంతో వీస్తున్న గాలులవల్ల వరిపంట నేలకు వాలిపోయి, గింజలు రాలిపోయి రైతాంగానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందన్నారు. వర్షపు వరదనీటి వల్ల చేతికి వచ్చిన పంట నీటిపాలయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి పూర్తిస్థాయిలో రైతాంగానికి నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని బాల్‌రాజ్ గౌడ్ డిమాండ్ చేశారు.

ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైనింగ్ విభాగంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ చాప్టర్ ఎంఈఏఐ జనరల్ సెక్రటరీ ఎం.నర్సయ్య, వైస్ చైర్మన్ వి.బాలకోటి రెడ్డి, సెక్రటరీ లక్షరసు కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.



ప్రధాన రహదారి కుడి వైపు డ్రైనేజీ పైప్‌లైన్‌ను పగలకొట్టి పునరుద్ధరించకుండా వదిలేసిన జీహెచ్ఎంసీ



కుంగిన మ్యాన్‌హోల్



రోడ్డుకు ఏర్పడిన గుంతలు

మాణికేశ్వర్‌నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- ఉప్పొంగుతున్న మ్యాన్‌హోల్స్
- వెదజల్లుతున్న దుర్వాసన..
- ప్రజలకు ఇబ్బందులు
- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- అధికారులకు వినతులిచ్చినా ప్రయోజనం శూన్యమని బస్తీవాసుల ఆవేదన

తార్నాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా వర్సిటీకి కూతవేటు దూరంలో ఉన్న మాణికేశ్వర్ నగర్ బస్తీ డ్రైనేజీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వ్యర్థాలతో పూర్తిగా నిండిపోవడం వల్ల మ్యాన్‌హోళ్ల ఉప్పొంగి మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నది. అందులోంచి వస్తున్న దుర్వాసనతో బస్తీవాసులు, ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లే విద్యార్థులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందికి గురవుతున్నారు.

● ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రైనేజీ పైప్‌లైన్‌లను పగులగొట్టి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి పునరుద్ధరణ పనును జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టలేదు. వర్షం కురిసినప్పుడల్లా మురుగు.. రోడ్లపై ప్రవహిస్తున్నది.



తొలగించని పూడికతీత వ్యర్థాలు

● భారీ వర్షాలకు మాణికేశ్వర్ నగర్ బస్తీకి వెళ్లే ప్రధాన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తరచూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ దుర్భర పరిస్థితి ఏర్పడిందని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పద్మారావుతో పాటు, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్‌కు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

ఎలివేటెడ్ కారిడార్ పనులతో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దు

● అధికారులతో ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు ప్రారంభించిన నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అధికారులను సూచించారు. గురువారం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను, ట్రాఫిక్ మళ్లింపును పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, హెచ్ఎండీఏ డిప్యూటీ ఇంజనీర్ విద్యాసాగర్ తదితర అధికారులతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపట్టిందన్నారు. బాలంరాయి చౌరస్తా, అన్నానగర్ చౌరస్తాలలో ట్రాఫిక్ తీవ్రంగా జామ్ అవుతున్నదని, స్థానిక బస్తీల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చూడాలని కోరారు. పలువురు వాహనదారులతో కూడా శ్రీగణేష్ మాట్లాడారు. వారు చేసిన సూచనలను కూడా ట్రాఫిక్ పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.



అధికారులతో మాట్లాడుతున్న శ్రీగణేష్




అడ్డగుట్ట: రక్తదానం చేస్తున్న మహంకాళి డివిజన్ పోలీసులు, రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఏసీపీ సుబ్బయ్య

రక్తదానం ప్రాణదానంతో సమానం

అడ్డగుట్ట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వ్యక్తుల్ని ఆదుకునేందుకు రక్తదానం ఎంతో అవసరమని గోపాలపురం డివిజన్ ఏసీపీ సుబ్బయ్య అన్నారు. పోలీస్ అమరుల సంస్కరణ దినోత్సవ సందర్భంగా గురువారం మారేడుపల్లిలోని పీజీ కాలేజీలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో టాటా మోటార్ సిబ్బంది, పోలీసులు, కాలేజీ విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని ఏసీపీ తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన యువతకు ఏసీపీ తన చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, గోపాలపురం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్‌లతో పాటు ఎస్సైలు పాల్గొన్నారు.

మహంకాళి డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో

రక్తదానం ప్రాణదానంతో సమానమని రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు తెలిపారు. పోలీస్ అమరుల సంస్కరణ దినోత్సవ సందర్భంగా గురువారం సికింద్రాబాద్ జూరాసియన్ క్లబ్‌లో మహంకాళి డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో అవసరమన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. శిబిరంలో మహంకాళి సీఐ నర్సింగ్‌రావుతో పాటు మార్కెట్ సీఐ రాంచందర్, సీఐ రమేష్ గౌడ్‌లతో పాటు వివిధ పోలీస్ స్టేషన్‌ల పోలీసులు, కాలేజీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.. మొత్తంగా 166 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జలందర్‌గౌడ్‌తో పాటు కాలేజీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రక్తం ఎంతో అవసరం

బోయినపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తలసీమియా, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం ఎంతో అవసరమని బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి అన్నారు. పోలీస్ అమవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డీఐ ఆనంద్ బాబుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ఏసీపీ అన్నారు. ప్రతి రక్తపు బొట్టు ఎంతో విలువైనదన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలన్నారు. వాహన చోదకులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలను వేగంగా నడపవద్దన్నారు. మైనర్‌లకు వెహికిల్స్ ఇవ్వొద్దన్నారు. పోలీసులు ధర్మం, చట్టాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేస్తారన్నారు. కార్యక్రమంలో బోయినపల్లి ఎస్ఐలు శివశంకర్, అవినాష్, నందిత, డీఎస్ఐ చందర్, బోయినపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసమితి ఆధ్వర్యంలో బీసీ సదస్సు

చిక్కడపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో నవంబరు 1న బీసీ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య తెలిపారు. ముషీరాబాద్ తెలంగాణ జనసమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్ డివిజన్‌లో బీసీ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు సాధన కోసం తెలంగాణ జనసమితి నవంబరు 1న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సదస్సు ఏర్పాటు చేసిందని ఆయన వెల్లడించారు. ఈ సదస్సుకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని బీసీ అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ జనసమితి అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్, నగర ఉపాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, నాయకులు గడ్డం శంకర్, సత్యనారాయణ, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

ప్రతీ ఓటు విలువైనదే : వక్తలు

● 2న ఉపఎన్నిక అభ్యర్థులతో ముఖాముఖి

పంజాగుట్ట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మతం, కులం, డబ్బు వంటివి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయని, అధికార పార్టీలు తమ విస్తృత అధికారాలను ఉపయోగించి గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని వక్తలు ఆరోపించారు. ప్రతీ ఓటు విలువైనదేనని, ఒక్క ఓటు గెలుపోటములను నిర్దేశించిన సందర్భాలు ఉన్నాయని వారు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓటరు అవగాహన కార్యక్రమం జరిగింది. పూర్వ రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి, విశ్రాంత ఐఏఎస్‌లు చంద్రవదన్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, తదితరులు మాట్లాడారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ఓయూలో అధ్యాపకుల నిరసన కొనసాగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమోషన్లలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు 26 రోజులుగా నిరసన తెలుపుతున్నారు. గురువారం కూడా ఉస్మానియా వర్సిటీ టీచర్స్ అసోసియేషన్(ఔటా) ఆధ్వర్యంలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ వద్ద భోజన విరామంలో ఆందోళన నిర్వహించారు. ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన సీపీఎస్ ఇంటర్వ్యూల్లో ఎన్నడూ లేని విధంగా 48 మంది అధ్యాపకులను రిజెక్ట్ చేయడాన్ని ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.మనోహర్ తీవ్రంగా ఖండించారు. బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతలు, ఉత్తమ పరిశోధనలు చేస్తున్న అధ్యాపకులకు సైతం ప్రమోషన్స్ ఇవ్వకుండా రిజెక్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. యూనివర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చేలా యూనివర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని అధ్యాపకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సురేష్‌కుమార్, సంధ్యారెడ్డి, పద్మజ, ఎంవీ రమణారావు, రమేష్, అపర్ణ, మాధురి, శశికళ, సుజాత, పి.రమేష్, నతానియల్, మెలిసా ఎలెన్, వెంకటేశ్వరరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఎఫ్ఏ హేమ సునీత తదితరులు

ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్ పంపొచ్చు

చిలకలగూడ, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ అందజేసే అవకాశాన్ని వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ టి. హేమ సునీత అన్నారు. సికింద్రాబాద్, రైల్ నిలయంలో గురువారం అవగాహన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, పెన్షనర్లు బ్యాంకు, పోస్టాఫీస్‌లకు వెళ్లకుండా ఇంటి నుంచే తమ లైఫ్ సర్టిఫికెట్‌ను అందజేయొచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఫైనాన్షియల్ అడ్వైజర్(జి) అభిషేకానందరావు, అసిస్టెంట్ ఫైనాన్షియల్ అడ్వైజర్ కె.సురేష్ బాబు, సీనియర్ సెక్షన్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా గుజ్జ సత్యం

బర్కత్‌పుర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : బీసీ జేఏసీ నూతన రాష్ట్ర కోఆర్డినేటర్‌గా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు బీసీ జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యం మాట్లాడుతూ 42శాతం బీసీ రిజర్వేషన్లను సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష బృందాన్ని బీసీ సంఘాలు, ప్రజా సంఘాలను ఢిల్లీకి తీసుకెళ్లి మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లుపెట్టి ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా అన్ని పక్షాలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. మిలియన్ మార్చ్ తరహాలో ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. కో ఆర్డినేటర్‌గా నియమించినందుకు ఎంపీ ఆర్. కృష్ణయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకుంటున్న గుజ్జ సత్యం

మాలమహానాడు జిల్లాల ఇన్‌చార్జిలు నియామకం

కవాడిగూడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ మాలమహానాడు జిల్లా ఇన్‌చార్జిలను రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ప్రకటించారు. గురువారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ జాతీయ మాలమహానాడు వ్యవస్థాపకుడు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సూచనల మేరకు 33 జిల్లాలకు ఇన్‌చార్జిలను ప్రకటించినట్లు తెలిపారు. హైదరాబాద్, సిద్దిపేట, మంచిర్యాల జిల్లాలకు బైరీ రమేష్, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి జిల్లాలకు చిప్పల నరసింహారావు, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు ఎ భాస్కర్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు ఆసాది పురుషోత్తం, సిరిసిల్లకు మేడి అంజయ్య, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాలకు బ్యాగరి వెంకటస్వామి, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాలకు తుమ్మల రవికుమార్, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆర్ శ్రీరాములు, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చిట్టిమల్ల సమ్మయ్య, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు అనంతరాములు, హనుమకొండ, కరీంనగర్ జిల్లాలకు వెన్నరాజు, జనగాంకు బుట్టి సత్యనారాయణ, వరంగల్‌కు జెల్ల ప్రభాకర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు నీరటి రాములు, నిజామాబాద్‌కు రాంచందర్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు టి సుధాకర్, ఆదిలాబాద్‌కు బందెల బెంజిమెన్‌లను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తెలిపారు. మాలల హక్కులు, మాల సామాజికవర్గంపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని నూతన ఇన్‌చార్జిలకు పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

ఐఐఎంసీ అధ్యాపకురాలికి డాక్టరేట్

ఖైరతాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐఐఎంసీ కళాశాల అధ్యాపకురాలు సీహెచ్ రాజ్యలక్ష్మీ కళ్యాణి ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ ఫాకల్టీలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) సాధించారు. ఈమేరకు ఆమె అధ్యయనం చేసిన అనురాగ్ విశ్వ విద్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వు రావడంతో లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. త్వరలో పీహెచ్‌డీ ప్రదానం ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు.



రాజ్యలక్ష్మీ కళ్యాణి